
# అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

### ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జూలై 22 : బాధితులు ప్రజావాణిలో సమర్పించిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో కలిసి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కారానికి ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు కలెక్టర్ ఫార్వార్డ్ చేశారు. కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన అంబాల నరసయ్య, నేలకొండపల్లి మండలం బోదుల బండకు చెందిన పొట్టపింజర మాధవి, ఏన్కూరు మండలం నాచారానికి చెందిన కాట్రగడ్డ లలిత, చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన శనిగవరపు శ్రీనివాస్, కొణిజర్ల మండలం అమ్మపాలెంకు చెందిన ఉసికల చిన్నిరాములు తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. సింగరేణి మండలం కారేపల్లికి చెందిన పి.మహేష్, చింతకాని మండలం నాగులవంచకు చెందిన నెల్లూరి ఇంద్ర, ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన బోడా బాబు, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి చెందిన టీచర్స్ కాలనీ వాసులు, ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన చిన్నంశెట్టి రామారావు, తల్లాడ మండలం మల్సూర్‌తండాకు చెందిన భూక్యా రాజగోపాల్, నగరంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన యు.దేవి, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన కె.సుభద్ర దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో ఎస్.వినోద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

### గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించండి

### భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం టౌన్, జూలై 22 : ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఆయన అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. పోడు పట్టాలు మంజూరు చేయాలని పాల్వంచ మండలం నాగారం, రంగాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతులు అర్జీలు అందజేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో రోజువారీ కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని ఆ సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో దరఖాస్తు సమర్పించారు. అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తూ తన తల్లి మృతి చెందిందని, తన తల్లి స్థానంతో తన భార్యకు అవకాశం కల్పించాలని కోరుతూ లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలకకు చెందిన బరపటి కృష్ణ కోరారు. వీటితోపాటు మరికొన్ని దరఖాస్తులను అదనపు కలెక్టర్లు పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన 'సింగరేణి' రాత పరీక్షలు

### 15 రోజుల్లో వెలువడనున్న ఫలితాలు

కొత్తగూడెం సింగరేణి, జూలై 22 : సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 272 పోస్టుల భర్తీ కోసం ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన రాత పరీక్షలు ముగిశాయి. దళారుల ప్రమేయం లేకుండా అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు సీఎండీ బలరాం పకడ్బందీ చర్యలు చేపట్టారు. మొత్తం 272 పోస్టులకు 18,665 మందికి హాల్‌టికెట్లు జారీ చేయగా.. 12,045 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. అయితే మొదటిసారిగా కంప్యూటర్ ఆధారితంగా పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాయగలిగారు. పరీక్షల నిర్వహణను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీసీఐఎల్‌కు అప్పగించారు. అయితే సింగరేణిలో రాత పరీక్షలు నిర్వహించిన రోజే ఫలితాలు విడుదల చేయడం సంస్థకున్న చరిత్ర. కానీ.. ఈసారి పరీక్షల నిర్వహణ బాధ్యతను బీసీఐఎల్‌కు అప్పగించింది. మొదట కీ పేపర్ విడుదల చేశారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత వాటిని పరిశీలించి ఫైనల్ కీ విడుదల చేస్తారు. ఆ తర్వాత వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తారు. దీంతో సుమారు 15 రోజుల్లో ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# జిల్లాలో నలుగురు సీఐల బదిలీలు

మామిళ్లగూడెం/ రఘునాథపాలెం, జూలై 22: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఎండీ ఉస్మాన్‌షరీఫ్‌ను ఖమ్మం వీఆర్‌కు అటాచ్ చేస్తూ రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. ఖమ్మం వీఆర్‌లో ఉన్న బరపటి రమేశ్‌ను మల్టీ జోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా ఉన్న తుమ్మలపల్లి శ్రీహరిని ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. రామగుండం కమిషనరేట్‌లోని మంచిర్యా సైబర్‌క్రైమ్ విభాగంలో ఉన్న ఎంఎల్ ముత్తిలింగయ్యను సత్తుపల్లి రూరల్ సీఐగా బదిలీ చేశారు. బదిలీల ఉత్తర్వులు అందుకున్న వారు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఉస్మాన్ షరీఫ్ సోమవారమే రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## కిన్నెరసాని నుంచి 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాల్వంచ రూరల్, జూలై 22 : ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో కిన్నెరసాని ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఉదయం నుంచి రెండు గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నా.. ప్రాజెక్టులో మధ్యాహ్నం నుంచి 14 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. నీటిమట్టం 402.9 అడుగులు ఉంది. ఎక్కువగా వచ్చే వరద నీటిని సోమవారం ఉదయం నుంచి రెండు గేట్లు ఎత్తి 6 వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. యానంబైలు లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వరద వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# బియ్యం అక్రమ రవాణాకు ఫుల్‌స్టాప్ పెట్టాలి

### జిల్లాలో రేషన్ డీలర్లే ప్రధాన భూమిక పోషించాలి

### డీలర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్

రఘునాథపాలెం, జూలై 22: రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో డీలర్లే కీలకపాత్ర వహించాలని ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కొణిజర్ల, రఘునాథపాలెం, చింతకాని, ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, సింగరేణి, ఏన్కూరు మండలాల రేషన్ డీలర్లతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపుల నుంచే బియ్యం పక్కదారి పడుతున్నాయనే అపవాదు ఇకపై రాకుండా చూసుకోవాలని అన్నారు. డీలర్లు సమయపాలన పాటించాలని, స్టాక్ బోర్డు, రిజిస్టర్లను తప్పక వినియోగించాలని సూచించారు. రేషన్ పంపిణీలో నిబంధనలు ఉల్లంగించిన డీలర్లపై 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గడిచిన ఏడాదిలో ఖమ్మం జిల్లాలో 9 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతూ పట్టుబడటం బాధాకరమైన విషయమని అన్నారు. ఇకపై రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ఆకస్మిక తనిఖీలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం.. షాపు నిర్వహణలో డీలర్లు పాటించాల్సిన విధులపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ అవగాహన కల్పించారు. డీటీలు మహ్మద్ అబ్దుల్ నిస్సార్, విజయ్‌బాబు, ఆర్ఐ నరేశ్, గోదాం ఇన్‌చార్జులు ప్రసన్నకుమార్, ఈ పాస్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవికుమార్, మండల కో-ఆర్డినేటర్లు దుర్గాప్రసాద్, అనీల్, రాకేశ్, కిశోర్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకన్న, షేక్ జానీమియా తదితరులు పాల్గొన్నారు.

# రామయ్య ఆదాయం రూ.1.21 కోట్లు

భద్రాచలం, జూలై 22 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా.. రూ.1,21,44,579 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఈవో పర్యవేక్షణలో 40 రోజులకు సంబంధించిన హుండీలను తెరిచి లెక్కించారు. అలాగే భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా.. బంగారం 104 గ్రాములు, వెండి 805 గ్రాములు వచ్చిందని, విదేశీ ద్రవ్యం 183 అమెరికన్ డాలర్లు, మయన్మార్ క్యాట్స్ 1000, ఖతార్ రియాల్స్ 3, అరబ్ దిరామ్స్ 20, కెనడా డాలర్లు 50, నేపాల్ రూపీస్ 10 వచ్చాయని పేర్కొన్నారు. చివరిసారిగా ఆలయ హుండీలను జూన్ 12న లెక్కించారు.



కానుకలను లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

# ప్రమాదవశాత్తు కారు దగ్ధం

### భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

మణుగూరు టౌన్, జూలై 22 : నడుస్తున్న కారులో నుంచి పెద్ద శబ్దం రావడంతోపాటు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో దంపతులు తీవ్ర గాయాలతో బయటపడగా.. కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ముత్యాలమ్మ పంచాయతీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓసీ-2లో పని చేస్తున్న పి.రామ్మోహన్ తన భార్య జ్యోత్స్నతో కలిసి కారులో మణుగూరు నుంచి పీవీ కాలనీ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముత్యాలమ్మనగర్ పంచాయతీ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా కారులో పెద్ద శబ్దంతో కూడిన మంటలు చెలరేగాయి. దీంతో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్, స్థానికులు గమనించి కారులో ఉన్న భార్యాభర్తలను బయటకు తీయగా.. వారికి అప్పటికే తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినా అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. క్షతగాత్రులు రామ్మోహన్, జ్యోత్స్న దంపతులను సింగరేణి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రంజిత్ సందర్శించి వివరాలను సేకరించారు. అయితే కారులో గ్యాస్ లీకేజీ వల్లే ప్రమాదం జరిగిందా? లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? అనేది తెలియరాలేదు.











